క్లుప్తంగా

పర్యావరణాన్ని పరిరక్షించాలి



మొక్కలు నాటుతున్న కమాండర్ ఈశ్వరరావు

కొమ్మాది: ప్రతి ఒక్కరు వ్యక్తిగత బాధ్యతగా పర్యావరణాన్ని పరిరక్షించాలని కమాండర్ ఈశ్వరరావు పిలుపునిచ్చారు. జీవీఎంసీ 4వ వార్డు ఎస్సీ కాలనీ, కాపులుప్పాడ ప్రాంతాల్లో స్థానిక నాయకుడు కోడిబోయిన అప్పలనాయుడు ఆధ్వర్యంలో మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న ఈశ్వరరావు మాట్లాడుతూ మొక్కలు నాటడంతో పాటు వాటి సంరక్షణను బాధ్యతగా నిర్వహించాలన్నారు. ఎన్‌డీఆర్‌ఎఫ్ బృందం సభ్యులు పాల్గొన్నారు.

శ్రీవారికి పట్టు వస్త్రాల సమర్పణ



శ్రీవారికి సమర్పించేందుకు పట్టు వస్త్రాలు తీసుకొస్తున్న అర్చకులు

కొమ్మాది: రుషికొండలో గల శ్రీ మహాలక్ష్మి సహిత శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయంలో శుక్రవారం వారాంత పూజలు అత్యంత వైభవంగా నిర్వహించారు. ముందుగా మంగళ వాయిద్యాల నడుమ శ్రీవారిని తోడ్కొని వెళ్లి అభిషేకాల అనంతరం పట్టుబట్టలతో ప్రత్యేకంగా అలంకరించి భక్తులకు దర్శనం కల్పించారు. ఈ కార్యక్రమంలో ఆలయ అర్చకులు, వేద పండితులు పాల్గొన్నారు.

జిల్లాలో మరిన్ని ఫుట్‌బాల్ శిక్షణ శిబిరాలు



రాష్ట్ర ఫుట్‌బాల్ అసోసియేషన్ డైరెక్టర్ డేనియల్ ప్రదీప్‌ను కలిసిన జిల్లా ప్రతినిధులు

తగరపువలస: జిల్లా ఫుట్‌బాల్ అసోసియేషన్ తరపున త్వరలో జిల్లాలో మరిన్ని మెరుగైన ఫుట్‌బాల్ శిబిరాలు ఏర్పాటు చేసి, క్రీడాకారులను తయారుచేయనున్నట్టు జిల్లా ఉపాధ్యక్షుడు రాజారావు, కార్యదర్శి అక్కరమాని చినబాబు తెలిపారు. రాష్ట్ర శాప్ డైరెక్టర్, రాష్ట్ర ఫుట్‌బాల్ అసోసియేషన్ కార్యదర్శి డేనియల్ ప్రదీప్‌ను శుక్రవారం నగరంలో కలిసి, జిల్లాలో చేపడుతున్న క్రీడా కార్యక్రమాల గురించి వివరించారు. అందులో భాగంగా మరింత మందికి ఫుట్‌బాల్ క్రీడను చేరువ చేయనున్నట్టు తెలిపారు. అయనను కలిసిన వారిలో అసోసియేషన్ కోచ్ శేషుమోహన్, కృష్ణ, సన్ని, రామకృష్ణ, ఫుట్‌బాల్ క్రీడాకారులు పాల్గొన్నారు.

నూతన అంశాల్లో నైపుణ్యం పెంచుకోవాలి

కొమ్మాది : గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం స్కూల్ ఆఫ్ టెక్నాలజీలోని కంప్యూటర్ సైన్స్ ఇంజినీరింగ్ విభాగం విద్యార్థులు సభ్యులుగా గల ఇనిస్ట్యూట్ ఆఫ్ ఎలక్ట్రానిక్స్ అండ్ ఎలక్ట్రికల్ ఇంజినీర్స్ (ఐఈఈఈ) విద్యార్థి విభాగం శుక్రవారం సమావేశమయింది. అమెరికాలోని లాస్‌ఏంజిల్స్ కేంద్రంగా గల సేల్స్‌ఫోర్స్.కామ్ సంస్థ సాంకేతిక విభాగం డైరెక్టర్ కె. శ్యామ్ హాజరై ప్రసంగించారు. ఇంజినీరింగ్ విద్యను అభ్యసించే వారు నూతన అంశాలపై నైపుణ్యం పెంచుకోవాలని తెలిపారు. గీతం డీన్ ప్రొఫెసర్ విజయశేఖర్ పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరికి తీవ్రగాయాలు

తగరపువలస: సంగివలస సర్వీస్ రోడ్డులో బ్యాంకాక్ బార్ అండ్ రెస్టారెంట్ వద్ద రెండు ద్విచక్ర వాహనాలు ఎదురెదురుగా వచ్చి ఢీకొన్న ప్రమాదంలో టి.మధు అనే వ్యక్తి తలకు తీవ్రగాయాలయ్యాయి. క్షతగాత్రుడు మధురవాడ నుంచి తగరపువలస వైపు వస్తుండగా ఎదురుగా వస్తున్న మరో ద్విచక్రవాహనం ఇతనిని ఢీకొంది. క్షతగాత్రునిది పల్నాడు జిల్లా ఎడ్లపాడు వద్ద లింగవారిపాలెం. ఇతని భార్య ఆమని ఫిర్యాదు మేరకు భీమిలి ఎస్ఐ తాతారావు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

సీఎం జగన్ పాలన దేశానికే ఆదర్శం

- అర్హులందరికీ లబ్ధి చేకూర్చేందుకే 'జగనన్న సురక్ష'
- ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు
- దరఖాస్తుదారులకు ధ్రువపత్రాల అందజేత



దాకమర్రి జగనన్న సురక్ష క్యాంపులో అర్హులకు పత్రాలు అందిస్తున్న ఎమ్మెల్యే ముత్తంశెట్టి



గండిగుండంలో లబ్ధిదారులకు ధ్రువ పత్రాలను అందజేస్తున్న ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు

ఆనందపురం : ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి పారదర్శక పాలన దేశానికే ఆదర్శంగా నిలుస్తోందని ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు అన్నారు. ఆనందపురం మండలంలోని మామిడిలోవ, గండిగుండం గ్రామాల్లో శుక్రవారం నిర్వహించిన జగనన్న సురక్ష కార్యక్రమంలో దరఖాస్తుదారులకు ఎమ్మెల్యే ధ్రువ పత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మన రాష్ట్రంలో అమలవుతున్న ఇంటింటికీ రేషన్ పంపిణీ కార్యక్రమాన్ని పంజాబ్‌లో అమలు చేస్తుండగా, కర్ణాటకలో వలంటీర్ల వ్యవస్థ ఏర్పాటుకు సన్నాహాలు జరుగుతున్నాయన్నారు. ఇలా అన్ని రాష్ట్రాలు జగన్ మోహన్‌రెడ్డి అమలు చేస్తున్న పథకాలను పరిశీలించి అమలు జరపడానికి ఏర్పాట్లు చేస్తున్నాయని, ఇది మనకు గర్వకారణమని చెప్పారు.

అభివృద్ధే ధ్యేయం

రాజకీయాలను పక్కన పెట్టి గ్రామాల అభివృద్ధే ధ్యేయంగా పని చేస్తున్నామని ఎమ్మెల్యే అన్నారు. గత అసెంబ్లీ ఎన్నికలతో పాటు అన్ని ఎన్నికలలోను వైఎస్సార్‌సీపీ అభ్యర్థులను ఓడించడానికి తిరిగిన వారికి కూడా అర్హత ఉంటే అన్ని పథకాలను వర్తింపజేస్తున్న ఘనత ముఖ్యమంత్రి జగన్ మోహన్‌రెడ్డికే దక్కుతుందని చెప్పారు. సమాజంలో రెండే వర్గాలు ఉంటాయని ఒకటి ధనిక, రెండు పేదల వర్గమని జగన్ మోహన్‌రెడ్డి పేదల పక్షాన నిలబడి వారిని అన్ని రకాలుగా ఆదుకుంటున్నారని అన్నారు. ఉపాధి హామీ పనులను కొనసాగించాలని, సత్రవు జంక్షన్‌లో రైతు బజారు ఏర్పాటుకు గల అవకాశాలను పరిశీలించాలని అధికారులను ఆదేశించారు. మామిడిలోవలో 349 మందికి, గండిగుండంలో 204 మందికి ధ్రువ పత్రాలను అందజేశారు.

ఆర్బీకే ప్రారంభం

గండిగుండంలో రూ.30 లక్షలతో నిర్మించిన సచివాలయ భవనాన్ని, ఎస్సీ కాలనీలో రూ.15 లక్షలతో నిర్మించిన అంగన్‌వాడీ భవనాన్ని, మామిడిలోవలో రూ.21 లక్షలతో నిర్మించిన రైతు భరోసా కేంద్రాన్ని ఎమ్మెల్యే ప్రారంభించారు. పీఎంకేఎస్‌వై మైక్రో వాటర్ షెడ్ ప్రాజెక్ట్ కింద రైతులకు రాయితీపై మంజూరైన వ్యవసాయ పనిముట్లను అందజేశారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యుడు కోరాడ వెంకటరావు, తహసీల్దారు ఎల్.రామారావు, ఎంపీడీవో ఎ.లవరాజు, గండిగుండం, మామిడిలోవ సర్పంచ్‌లు, గంర్రెడ్డి శ్రీనివాస్, బలిరెడ్డి చంటి, ఎంపీటీసీ సభ్యురాలు పావాడ గౌతమి, మాజీ ఎంపీటీసీ సభ్యుడు బలిరెడ్డి మహేష్, వైస్ ఎంపీపీ పాండ్రింకి శ్రీను, నాయకులు డోల దేవుడు, బలిరెడ్డి రమణమ్మ, అప్పికొండ నాగేశ్వర రావు, గంర్రెడ్డి గోవింద్, కరకాన సత్తిబాబు తదితరులు పాల్గొన్నారు.

పేదరిక నిర్మూలనే సీఎం ధ్యేయం

తగరపువలస: రాష్ట్రంలో పేదరిక నిర్మూలనే ధ్యేయంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి జనరంజకమైన పాలన అందిస్తున్నారని ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు అన్నారు. శుక్రవారం సాయంత్రం భీమిలి మండలం తాటితూరు, దాకమర్రి పంచాయతీలలో నిర్వహించిన జగనన్న సురక్ష క్యాంపులలో అర్హులకు ధ్రువీకరణ పత్రాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సంక్షేమ పథకాలు, సచివాలయ, వలంటీర్ వ్యవస్థల కారణంగా పేదరిక నిర్మూలనలో దేశంలోనే మన రాష్ట్రం 5వ స్థానానికి చేరుకుందన్నారు. పేదలకు సంక్షేమ పథకాలు అందించడానికి సీఎం జగన్‌లా మంచి మనసు ఉండాలని, చంద్రబాబులా పెద్ద వయసు అవసరం లేదని అన్నారు. కార్యక్రమాలలో తహసీల్దార్ కోరాడ వేణుగోపాల్, ఎంపీడీవో పి.వెంకటరమణ, వ్యవసాయశాఖ జిల్లా సలహా మండలి చైర్మన్ దాట్ల పెదబాబు, ఎంపీపీ దంతులూరి వాసురాజు, జెడ్పీటీసీ సభ్యుడు గాడు వెంకటప్పడు, వైస్ ఎంపీపీ బోని బంగారునాయుడు, సర్పంచ్‌లు శిరిగుడి సంతోషి, చెల్లూరి పైడప్పడు, ముద్దాడ అప్పయ్యమ్మ, ఎంపీటీసీ సభ్యులు చెల్లూరి నగేష్, ఉండబట్ల ఆదిలక్ష్మి, గ్రామ సచివాలయాల మండల కన్వీనర్ సరగడ రఘునాథరెడ్డి, పార్టీ మండలఅధ్యక్షుడు గాడు శ్రీను, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

నగరంలో పార్కుల అభివృద్ధికి ప్రాధాన్యం

- జీవీఎంసీ కమిషనర్ సాయికాంత్ వర్మ



ఎండాడలో పర్యటిస్తున్న కమిషనర్ సాయికాంత్ వర్మ

కొమ్మాది: నగరంలో పార్కుల అభివృద్ధికి ప్రాధాన్యం ఇస్తున్నామని జీవీఎంసీ కమిషనర్ సాయికాంత్ వర్మ పేర్కొన్నారు. క్షేత్రస్థాయి పర్యటనలో భాగంగా జోన్–2 పరిధిలోని ఎండాడ, సాగర్‌నగర్ ప్రాంతాల్లో అభివృద్ధి చేయనున్న పార్కులను శుక్రవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రజలు సేద తీరేందుకు గాను, నగరంలో ప్రతీ ప్రాంతంలో పార్కులను అభివృద్ధి పరిచేందుకు ప్రణాళిక సిద్ధం చేశామని తెలిపారు. ముఖ్యంగా వృద్ధులు, పిల్లలతో పాటు అన్ని వయసుల వారికి ఉపయోగపడే విధంగా ప్లేగ్రౌండ్, జిమ్, వాకింగ్ ట్రాక్ ఉండేలా ఏర్పాట్లు చేస్తున్నామని తెలియజేశారు. ఎండాడ వైఎస్సార్ లే అవుట్ ప్రాంతంలో పామ్ థీమ్ పార్కు కొరకు సుమారు రూ.1.5 కోట్ల వ్యయంతో పనులు ప్రారంభించడం జరుగుతుందన్నారు. సాగర్‌నగర్ తదితర ప్రాంతాల్లో పారిశుధ్య నిర్వహణ సరిగా లేదని, శానిటరీ ఇన్‌స్పెక్టర్లు దగ్గరుండి పారిశుధ్య పనులు పర్యవేక్షించాలని ఆదేశించారు. ఈ పర్యటనలో పర్యవేక్షక ఇంజినీర్లు సత్యనారాయణ రాజు, శ్యామసన్‌రాజు, కార్యనిర్వాహక ఇంజినీర్లు శ్రీనివాస్, ప్రసాద్, ఉపకార్యనిర్వాహక ఇంజినీర్ వంశీ తదితరులు పాల్గొన్నారు.

ఓటర్ల జాబితాల పరిశీలన



ఎగువపేట ప్రాంతంలో ఇళ్ల వద్ద ఓటర్ల జాబితాలను పరిశీలిస్తున్న ఆర్‌డీవో భాస్కరరెడ్డి

భీమునిపట్నం: భీమిలి ప్రాంతంలో ఇంటింటికీ వెళ్లి ఓటర్ల జాబితాలను పరిశీలించే కార్యక్రమం శుక్రవారం ప్రారంభమైంది. కార్యక్రమంలో నియోజకవర్గ ఓటర్ల నమోదు అధికారి ఎస్.భాస్కరరెడ్డి పాల్గొని, ఎగువపేట, నిడిగట్టు పోలింగ్ కేంద్రాల ప్రాంతంలో ఇంటింటికీ వెళ్లి ఓటర్ల జాబితాల్లో వివరాలు సరిగ్గా ఉన్నాయా అని పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ జాబితాల పరిశీలనను చాలా జాగ్రత్తగా నిర్వహిస్తున్నామని చెప్పారు. జోనల్ కమిషనర్ బొడ్డేపల్లి రాము, ఎన్నికల డిప్యూటీ తహసీల్దారు భాస్కరరావు, సిబ్బంది పాల్గొన్నారు.

ఓటర్ సర్వే ప్రారంభం



ఎస్‌జీజీవోస్ కాలనీ స్కూల్లో సర్వే చేస్తున్న సిబ్బంది

మధురవాడ : జీవీఎంసీ 7వ వార్డు ఎన్‌జీజీవోస్ కాలనీలోని ఎంపీయూపీ స్కూల్లో సచివాలయ సిబ్బంది ఓటర్ సర్వే చేశారు. ఈ సందర్భంగా వారు కాలనీలో మణించిన వారు, కొత్తగా ఓటు నమోదు చేసుకోవాల్సిన వారి వివరాలు పరిశీలించారు. ఈ కార్యక్రమంలో వార్డు వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు పోతిన శ్రీనివాసరావు, తమ్మినేని వరలక్ష్మి, సచివాలయ సిబ్బంది, బీఎల్‌వోలు పాల్గొన్నారు.

గంభీరంలో..

ఆనందపురం : మండలంలో ఇంటింటా ఓటర్ల సర్వే కార్యక్రమం శుక్రవారం ప్రారంభమైంది. ఓటరు సవరణ ప్రక్రియలో భాగంగా ఈ కార్యక్రమం నెల రోజుల పాటు కొనసాగనుంది. బూత్ లెవల్ అధికారితో పాటు గుర్తింపు పొందిన వివిధ రాజకీయ పార్టీలు నియమించుకున్న ఏజెంట్లు కూడా సర్వేలో పాల్గొనవచ్చు. ఈ సందర్భంగా తహశీల్దార్ లోకవరపు రామారావు మాట్లాడుతూ మండలంలో 56 పోలింగ్ బూత్‌లు ఉన్నాయని తెలిపారు. సిబ్బంది ఇంటింటి సర్వేలో ఓటరు అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకుంటారు. రెండు చోట్ల ఓటు హక్కు ఉంటే ఓటరు అభిప్రాయం మేరకు రెండో చోట ఉన్న ఓటుని తొలగిస్తామన్నారు. అలాగే మరణించిన వారి ఓటు తొలగించవలసి వస్తే మరణ ధ్రువపత్రం తీసుకోవాలన్నారు. ఇళ్లకు వచ్చే బూత్ లెవల్ అధికారుల వద్ద సంబంధిత ఫారాలు ఉంటాయన్నారు. వారికి పూర్తి వివరాలు అందజేసి మార్పులు చేర్పులు చేసుకోవాలన్నారు.

వీఆర్‌ఏల ఆందోళన



ఆందోళన చేస్తున్న వీఆర్‌ఏలు

పద్మనాభం: తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ వీఆర్‌ఏలు తహసీల్దార్ కార్యాలయం వద్ద శుక్రవారం ఆందోళన చేశారు. కనీస వేతనం రూ.25వేలు ఇవ్వాలని, నామినీగా పని చేస్తున్న వారిని వీఆర్‌ఏలగా నియమించాలని, పదోన్నతి కల్పించాలని కోరుతూ తహసీల్దార్ టి.శ్రీవల్లికి వినతి పత్రం ఇచ్చారు. వీఆర్‌ఏల మండల సంఘం అధ్యక్షుడు పాట్నూరు సాధు పాల్గొన్నారు.

పారదర్శకంగా ఓటర్ల జాబితా సవరణ



మాట్లాడుతున్న తహసీల్దార్ శ్రీవల్లి

పద్మనాభం: ఓటర్ల జాబితా సవరణను పారదర్శకంగా నిర్వహించాలని తహసీల్దార్ టి.శ్రీవల్లి సూచించారు. వైఎస్సార్ క్రాంతి పథం కార్యాలయంలో అఖిల పక్ష నాయకులు, బీఎల్‌వోలతో శుక్రవారం నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడారు. వచ్చే నెల 21 వరకు ఓటర్ల జాబితాలో ఉన్న పేర్ల గురించి ఇంటింటి సర్వే చేసి పరిశీలించాలన్నారు. మృతి చెందిన వారి పేర్లను తొలగించాలని, కొత్త వారిని ఓటర్ల జాబితాల్లో చేర్చుకోవాలని సూచించారు. డీటీ శ్రీనివాసరావు, ఇన్‌చార్జి ఈవోఆర్డీ రఘు పాల్గొన్నారు.

దేశాభివృద్ధికి ప్రధాని మోదీ ఎనలేని కృషి

ఆనందపురం : దేశాభివృద్ధికి ప్రధాని మోదీ ఎనలేని కృషి చేస్తున్నారని బీజేపీ జిల్లా మహిళా మోర్చా అధ్యక్షురాలు ఉమ్మడి సుజాత తెలిపారు. మండలంలోని గంభీరంలో శుక్రవారం ఆమె పార్టీ మహిళలతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం అన్ని వర్గాల వారికి ఎన్నో పథకాలను అమలు చేస్తోందని, వాటిని ప్రజలకు వివరించాలని చెప్పారు. పార్టీని గ్రామాల్లో బలోపేతం చేయడానికి అందరూ కృషి చేయాలని కోరారు. ఈ సందర్భంగా భీమిలి జోన్ మండల కమిటీలను నియమించారు. జోనల్ మహిళా మోర్చా ఇన్‌చార్జి రోహిణి, జిల్లా కిసాన్ మోర్చా అధ్యక్షుడు ప్రసాదరావు పట్నాయక్, పార్టీ మండల అధ్యక్షుడు మీసాల రాముానాయుడు పాల్గొన్నారు.

28న సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం



మంజూరు లేఖను వరప్రసాద్‌కు అందజేస్తున్న కలెక్టర్ మల్లికార్జున

మహారాణిపేట : రాజన్న ఆటోనగర్‌లో పక్కా గృహాలు, ఇతర పథకాలు మంజూరు చేస్తూ కలెక్టర్ డాక్టర్ మల్లికార్జున ఉత్తర్వులు జారీ చేశారని రాజన్న ఆటోనగర్ సలహాదారు పి.వరప్రసాద్ తెలిపారు. శుక్రవారం కలెక్టరేట్‌లో మంజూరు లేఖను కలెక్టర్ అందజేసినట్లు తెలిపారు. ఆనందపురం మండలం కనుమం గ్రామంలో 151.7 ఎకరాల స్థలంలో స్క్రాప్ వర్కర్ల గృహ నిర్మాణానికి ప్రభుత్వం రూ.32 కోట్లు మంజూరు చేసింది. ఈ పథకానికి ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్ ఇవ్వడంతో ఈనెల 28 ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం నిర్వహిస్తామన్నారు. ఈ నిర్మాణ బాధ్యతలను ఏపీఐఐసీకి అప్పగించారని రాజన్న ఆటోనగర్ ప్రెసిడెంట్ పి.ఖాజావలీ తెలిపారు.

మారుపేరు కార్మికుల సమస్యలను 'జగనన్నకు చెబుదాం'

తగరపువలస : చిట్టివలస జ్యూట్‌మిల్లులో మారుపేర్లు కలిగిన సుమారు 400 మంది కార్మికుల సమస్యలను జగనన్నకు చెబుదాంలో ఫిర్యాదు చేయనున్నట్టు అఖిలపక్ష కార్మిక సంఘాల నాయకులు తీర్మానించారు. ఈ మేరకు కాంగ్రెస్ కార్మిక సంఘం, చిట్టివలస లేబర్ యూనియన్, టిఎన్‌టియూసీ నాయకులు శుక్రవారం సమావేశమయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 2009 ఏప్రిల్ 20న మిల్లుకు లాకౌట్ విధించిన యాజమాన్యం తర్వాత పూర్తిగా మూసివేసిందన్నారు. కార్మికులందరికీ అంచెలంచెలుగా పీఎఫ్ చెల్లించినా మారుపేర్లు కలిగిన కార్మికులకు ఇప్పటి వరకు చెల్లింపులు జరగలేదన్నారు. ఇటీవల మిల్లు మూత తర్వాత మారుపేరు కార్మికులకు కూడా అదే పేరుతో నోటరీల ద్వారా యాజమాన్యం గ్రాట్యుటీ, నష్టపరిహారం చెల్లించిందన్నారు. పీఎఫ్ చెల్లింపుల విషయంలో ఆధార్‌లో ఒకపేరు మిల్లులో మారుపేరు ఉండటంతో చెల్లింపుల సమస్య జటిలంగా మారిందన్నారు. ప్రభుత్వం మాత్రమే గజిట్ ద్వారా పీఎఫ్ ట్రస్ట్ బోర్డుకు తెలిపి కార్మికులకు న్యాయం చేయగలదన్నారు. ఈ సమావేశంలో అఖిలపక్ష నాయకులు అల్లు బాబూరావు, దల్లి అప్పలరెడ్డి, కొండపు ఈశ్వరరావు, తమ్మిన కూర్మారావు, మద్దుల దేవుళ్లు, బోర రామారావు, నరవ రామారావు, కానూరి రాంబాబు తదితరులు పాల్గొన్నారు. ఈ నెల 24 ఉదయం 9 గంటలకు మారుపేరు కార్మికులు ఆధార్‌కార్డు, వేతన స్లిప్పు, రేషన్‌కార్డుతో కాంగ్రెస్ కార్మిక సంఘ కార్యాలయానికి రావాలని నాయకులు పిలుపు ఇచ్చారు.

బాలల భవిష్యత్తుకు ప్రాథమిక స్థాయిలోనే పునాది

పద్మనాభం: బాలల భవిష్యత్తుకు ప్రాథమిక పాఠశాల స్థాయిలోనే పునాది వేయాలని ఎంపీపీ కంటుబోతు రాంబాబు అన్నారు. మండల పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో శుక్రవారం జరిగిన ప్రధానోపాధ్యాయుల సమావేశంలో ఆయన మాట్లాడారు. విద్యార్థుల భవిష్యత్తు ఉపాధ్యాయుల చేతుల్లోనే ఉందన్నారు. గంధవరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన విభిన్న ప్రతిభావంతుడు ద్వారపూడి మహీధర్‌కు సమగ్ర శిక్షా అభియాన్ మంజూరు చేసిన రూ.10వేలు విలువ చేసే ఎమ్మార్ కిట్‌ను ఎంపీపీ అందజేశారు. పద్మనాభం ఇన్‌చార్జి ఎంఈవోగా పనిచేసి పదోన్నతిపై భీమునిపట్నం ఎంఈవో–1గా బదిలీ అయిన ఎం.శివరాణిని సత్కరించి, జ్ఞాపిక అందజేశారు. ఉపాధ్యాయ సంఘ నాయకులు శివరాణిని తమ సంఘాల తరపున సన్మానించారు. ఎంఈవో–1 పి.రమణ, ఎంఈవో–2 బాబూలాల్, ఉపాధ్యాయ సంఘ నాయకులు పాల్గొన్నారు.

పారదర్శకతకు చిరునామా జగనన్న పాలన



మహిళకు సంక్షేమ పథకాల బ్రోచర్ అందజేస్తున్న ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు

పీఎం పాలెం : ప్రభుత్వ సంక్షేమ పథకాల అమలులో సీఎం జగన్ మోహన్‌రెడ్డి పాలన అత్యంత పారదర్శకంగా ఉందని భీమిలి ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు అన్నారు. శుక్రవారం సాయంత్రం పీఎం పాలెం లోని 48వ సచివాలయం ఏరియాలో గడప గడపకూ మన ప్రభుత్వం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ సచివాలయం పరిధిలో 1273 గృహాలు ఉండగా అందులో 2864 మందికి వివధ పథకాల కింద ఆరుకోట్ల 53 లక్షల 73 వేల రూపాయలు అందజేశామన్నారు. ఆ ప్రాంతంలో ఉద్యోగుల శాతం అధికంగా ఉండటంతో వారి కుటుంబ సభ్యులు కూడా ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. వారిని అభిప్రాయం చెప్పమనగా సీఎం జగన్‌మోహన్‌రెడ్డి పాలన చాలా బాగుందన్నారు. నిబంధనల కారణంగా తమకు పథకాలు వర్తించకపోయినా అసంతృప్తి లేదని తమ మద్దతు సీఎం జగన్‌మోహన్‌రెడ్డికే అని ప్రకటించారు. రానున్న ఎన్నికల్లో భీమిలి ఎమ్మెల్యేగా తనను గెలిపించి జగనన్నను మరోమారు సీఎం గా నిలుపుకుందామని ప్రజలకు ఎమ్మెల్యే పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఆరో వార్డు కార్పొరేటర్ లక్ష్మీ ప్రియాంక, మధురవాడ జోన్ జెడ్పీ కనకమహాలక్ష్మి, వైఎస్సార్‌సీపీ 6,7 వార్డుల అధ్యక్షులు బొట్ట అప్పరాజు, పోతిన శ్రీనివాసరావు, సీనియర్ నాయకులు గాదె రోశిరెడ్డి, వార్డు అధ్యక్షురాలు కె. వరలక్ష్మి, స్థానిక నాయకులు పోతిన సూరిబాబు, యల్లాజీ, కృష్ణమూర్తి పాత్రుడు, ఎంపీ నరసింహారావు, అప్పారావు, జామి శివకుమార్, స్థానికులు పాల్గొన్నారు.

డ్రంక్ అండ్ డ్రైవ్ నిందితులకు జరిమానా

పీఎం పాలెం: పీఎం పాలెం ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ పరిధిలో నిర్వహించిన డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలలో పోలీసులకు చిక్కిన వారిపై న్యాయస్థానం కొరడా ఝుళిపించింది. స్టేషన్ పరిధిలో మద్యం సేవించి ద్విచక్రవాహనం నడుపుతున్న 27 మంది పోలీసులకు పట్టుబడటంతో వారిపై కేసులు నమోదు చేశారు. వారిని న్యాయం స్థానం ముందు హాజరు పరచగా ఎస్‌పీఎల్ జ్యూడీషియల్ మెజిస్ట్రేట్ సెకెండ్ క్లాస్ ఫర్ ఎక్సైజ్ కోర్టు ఎదుట హాజరు పరచగా నిందితులు ఒక్కొక్కరికి రూ. 5 వేలు చొప్పున లక్షా 35 వేల రూపాయలు జరిమానా విధించినట్లు స్థానిక ట్రాఫిక్ ఎస్ఐ మురళీకృష్ణ శుక్రవారం తెలిపారు.

దంత వైద్యంలో విప్లవాత్మక మార్పులు



కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న డాక్టర్ బల్వీందర్ సింగ్

కొమ్మాది : దంత వైద్య రంగంలో విప్లవాత్మక మార్పులు సంభవిస్తున్నాయని ఇండియన్ ఆర్థోడాంటిక్ సొసైటీ (ఐవోఎస్) జాతీయ అధ్యక్షుడు డాక్టర్ బల్వీందర్ సింగ్ టక్కర్ పేర్కొన్నారు. గీతం దంత వైద్య కళాశాల, ఆసుపత్రి, ఇండియన్ ఆర్థోడాంటిక్ సొసైటీ సంయుక్తంగా నిర్వహిస్తున్న ఇన్‌విజిబుల్ ఆర్థోడాంటిక్స్ జాతీయ సదస్సును ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ త్రీడీ ప్రింటింగ్, కంప్యూటర్ సైన్స్‌తో పాటు ఇన్‌విజిబుల్ ఆర్థోడాంటిక్స్ వంటివి అందుబాటులోకి రావడం వలన ప్రజలకు మెరుగైన చికిత్స అందించడానికి వీలు కలుగుతుందన్నారు. ఇతర రంగాల మాదిరి భారతీయ దంత వైద్యులు అంతర్జాతీయ స్థాయిలో ప్రతిభ కనపరుస్తున్నారని, ఐవోఎస్ ద్వారా దేశంలోని పీజీ దంత విద్యార్థులకు పరిశోధనా నిధులు అందించడం, నూతన నైపుణ్యాలపై అవగాహన కలిగించడం, స్టూడెంట్ ఎక్స్‌చేంజ్ కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. 2025లో విశాఖలో మరో జాతీయ సదస్సు నిర్వహిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఐవోఎస్ కార్యదర్శి డాక్టర్ సంజయ్‌లాల్, గీతం దంత కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ డి. సీతారామరాజు పాల్గొన్నారు.

జాతీయ రహదారిపై లారీ దగ్ధం



దగ్ధమవుతున్న లారీ

కొమ్మాది: జాతీయ రహదారిపై గురువారం అర్ధరాత్రి ఓ లారీ మంటల్లో దగ్ధమయింది. వైజాగ్ నుంచి మధురవాడ వైపు వెళ్తున్న లారీ ఎండాడ జాతీయ రహదారి దాటిన తర్వాత ఒక్కసారిగా మంటలు వ్యాపించాయి. క్యాబిన్‌లో షార్టు సర్క్యూట్ కారణంగా మంటలు వ్యాపించడాన్ని గమనించిన డ్రైవర్, క్లీనర్ లారీని అక్కడే నిలిపివేసి ఒక్కసారిగా బయటపడ్డారు. పూర్తి స్థాయిలో లారీ మంటల్లో కాలిపోయింది. విషయం తెలుసుకున్న పీఎంపాలెం ట్రాఫిక్ పోలీసులు అక్కడికి చేరుకుని అగ్నిమాపక కేంద్రానికి సమాచారం అందించి మంటలను అదుపు చేయించారు. అర్ధరాత్రి కావడంతో ఎవరికి ఎటువంటి ప్రమాదం జరగలేదు.

స్వశక్తి భవనంలోకి సచివాలయం



జమ్మిచెరువు పార్కు పక్కన ఉన్న స్వశక్తి భవనం

భీమునిపట్నం: భీమిలిలోని తోటవీధిలో ఉన్న సచివాలయాన్ని శుక్రవారం తగరపువలస రోడ్డులోని జమ్మిచెరువు పార్కు పక్కన కొత్తగా నిర్మించిన స్వశక్తి భవనంలోకి తరలించారు. సచివాయాలు ఏర్పాటు చేసినప్పుడు ఈ సచివాలయాన్ని తోటవీధిలోని ప్రభుత్వ కల్యాణ మండపంలో ఏర్పాటు చేశారు. కాగా గతంలో ఇందులో శుభకార్యాలు, సమావేశాలు జరిగేవి. సచివాలయం నిర్వహణతో ఆ అవకాశం లేకుండా పోయింది. ఇటీవల కొత్తగా స్వశక్తి భవనం ఏర్పాటు కావడంతో ఈ సచివాలయాన్ని అందులోకి మార్చటంతో మళ్లీ తోటవీధి కల్యాణ మండపంలో వివిధ కార్యక్రమాలు నిర్వహించుకోవడానికి అవకాశం ఏర్పడింది. స్వశక్తి భవనం అందరికీ అందుబాటులో ఉండడంతో సచివాలయ నిర్వహణ చక్కగా జరగనుంది.

పైప్‌లైన్‌కు మరమ్మతులు

సాక్షి ఎఫెక్ట్..



జాతీయ రహదారి రెండు వంతెనల కింద మరమ్మతులు పూర్తి చేసిన పైప్‌లైన్

తగరపువలస: స్థానిక జాతీయ రహదారిపై రెండు వంతెనల కింద గోస్తని నదీ తీరంలో రెండు రోజుల క్రితం విరిగిపోయిన పైప్‌లైన్‌కు శుక్రవారం ఉదయం మరమ్మతులు పూర్తి చేశారు. వెంటనే తాగునీటి సరఫరాను పునరుద్ధరించారు. బాలాజీనగర్ నుంచి గోస్తని నది వైపు డ్రైనేజీ పునరుద్ధరణ పనులలో భాగంగా జేసీబీకి తగులుకుని బుధవారం తాగునీటి పైపులైన్ పగిలి, గురువారం భీమిలి జోన్‌లో తాగునీటి సరఫరాకు అంతరాయం ఏర్పడింది. ఈ సమస్యపై 'నిలిచిన తాగునీటి సరఫరా' శీర్షికతో సాక్షిలో శుక్రవారం ప్రచురించిన వార్తపై స్పందించిన తాగునీటి సరఫరా ఏఈ సురేష్ మాట్లాడుతూ సిబ్బంది రెండురోజుల పాటు రాత్రిపగలు శ్రమించినా ప్రతికూల పరిస్థితుల కారణంగా పైపులైన్ మరమ్మతులు పూర్తి కాలేదని తెలిపారు. శుక్రవారం ఉదయం అదనంగా మరోపైపు సాయంతో మరమ్మతులు పూర్తి చేసి, తాగునీటి సరఫరా పునరుద్ధరించామన్నారు. ఇకపై ఎలాంటి లోపాలు లేకుండా నిరంతరం తాగునీటి సరఫరాకు కృషి చేస్తామని చెప్పారు.